చరణ్ కెరీర్‌లో గుర్తుండిపోయేలా..

బంధాలను అమితంగా ప్రేమించే సామాన్యుడి భావోద్వేగాలే ప్రధాన ఇతివృత్తంగా సుకుమార్ తెరకెక్కించిన 'రంగస్థలం' సినిమా దర్శకుడిగా సుకుమార్‌లోని కొత్తకోణాన్ని ఆవిష్కరించింది. నటుడిగా రామ్‌చరణ్‌ని మరోస్థాయిలో నిలబెట్టింది. మళ్లీ ఈ కాంబినేషన్ కోసం మెగా అభిమానులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు. వారి ఆశల్ని నిజం చేస్తూ మళ్లీ కలిసి పనిచేయడానికి రామ్‌చరణ్, సుకుమార్ సిద్ధమయ్యారు. మైత్రీమూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై ఈ ప్రతిష్టాత్మక చిత్రం రూపొందనుంది. రామ్‌చరణ్ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాగా సుకుమార్ స్క్రిప్ట్ సిద్ధం చేశారని నిర్మాతలు చెబుతున్నారు. 'ఆర్ఆర్ఆర్'తో గ్లోబల్‌స్టార్‌గా ఎదిగారు రామ్‌చరణ్. 'పుష్ప'తో పాన్‌ఇండియా డైరెక్టర్‌గా నిలిచారు సుకుమార్. మారిన వీరి ఇమేజ్‌కి తగ్గట్టుగా కథ, కథనం, బడ్జెట్ ఉంటాయని నిర్మాతలు తెలిపారు. ఈ ఏడాదిలో షూటింగ్ మొదలుపెట్టి 2025 చివరిలో సినిమాను విడుదల చేస్తామని వారు చెప్పారు. దేవిశ్రీ ప్రసాద్ స్వరాలందించనున్న ఈ పాన్ ఇండియా సినిమాకు నిర్మాతలు: నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్.

'లెజెండ్' రీరిలీజ్

బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో వచ్చిన 'లెజెండ్' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. 14రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, వారాహి చలన చిత్ర పతాకాలపై అనిల్ సుంకర, సాయి కొర్రపాటి నిర్మించారు. ఈ సినిమా విడుదలై పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30న రీరిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా రీరిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. బాలకృష్ణ, బోయపాటి శ్రీను కలయికలో వచ్చిన బ్లాక్‌బస్టర్ మూవీని తిరిగి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం ఆనందంగా ఉందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీతాన్నందించారు. ప్రస్తుతం బాలకృష్ణ...బాబీ దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు.

ఇంతకంటే దిగజారొద్దు..

'నేటి హీరోయిన్లను చూస్తుంటే జాలేస్తుంది. ఇంత దారుణమైన సోషల్‌మీడియాను ఎదుర్కొంటూ కెరీర్ సాగిస్తున్నారంటే నిజంగా వారిని అభినందించాలి. యాభైకి దగ్గరపడుతున్న నాలాంటి వారినే వదలడం లేదు. లేనిపోనివి ఊహించి రాసేస్తూ, ఇంట్లో మనశ్శాంతి లేకుండా చేస్తున్నారు. మా పరిస్థితే ఇలా ఉంటే, ఇక యంగ్‌స్టర్స్ పరిస్థితేంటి?' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది నాటి అందాలతార మీనా. ఇటీవల సోషల్‌మీడియాలో తనపై వస్తున్న ట్రోల్స్ గురించి ప్రస్తావిస్తూ మాట్లాడింది మీనా. 'నా భర్త పోయారు. ఇప్పుడు నా బిడ్డ, నా తల్లిదండ్రులే సర్వస్వంగా బతుకుతున్నాను. కానీ నేను వేరే ఎవరితోనో రిలేషన్‌లో ఉన్నట్టు, త్వరలో వివాహం చేసుకోబోతున్నట్టు వార్తలు రాస్తున్నారు. నాకూ ప్రైవేట్ లైఫ్ ఉంటుంది. నేనేకాదు.. ఇలాంటి రోత రాతల వల్ల నా ప్రపంచంలో ఉన్నవాళ్లంతా సఫరవుతారు. అబద్ధాలు రాసి బతకడం వ్యభిచారంతో సమానం. ఇంతకంటే దిగజారుడుతనం వేరొకటి ఉండదు. ఇప్పటికైనా మనుషుల్లా బతకండి' అంటూ ఆవేశంగా మాట్లాడింది మీనా.

ధూం ధాం ప్రేమకథ

చేతన్‌కృష్ణ, హెబ్బాపటేల్ జంటగా రూపొందుతోన్న చిత్రం 'ధూం ధాం'. సాయికిశోర్ మచ్చా దర్శకుడు. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రం సమ్మర్‌లో విడుదల కానుంది. హోలీ పర్వదినం సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన కొత్త పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఫారిన్ లొకేషన్స్‌లో చేతన్‌కృష్ణ, హెబ్బాపటేల్ జంటగా నడుచుకుంటూ వస్తున్న స్టిల్‌ను ఈ పోస్టర్‌లో రివీల్ చేశారు. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా ఈ సినిమా తెరకెక్కుతున్నదని, త్వరలోనే థియేట్రికల్ రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. సాయికుమార్, వెన్నెల కిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ, శివన్నారాయణ, బెనర్జీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సిద్దార్థ్ రామస్వామి, సంగీతం: గోపీసుందర్.

సీక్రెట్‌గా పెళ్లి చేసుకుందా?

అగ్ర కథానాయిక తాప్సీ రహస్యంగా వివాహం చేసుకున్నట్లు తెలిసింది. డెన్మార్క్‌కు చెందిన బ్యాడ్మింటన్ ప్లేయర్ మథియాస్ బోతో ఈ భామ గత తొమ్మిదేళ్లుగా ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. ఈ నెల 23న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో అతికొద్దిమంది సన్నిహితుల సమక్షంలో ఈ జంట వివాహం జరిగిందని మీడియాలో వార్తలొస్తున్నాయి. ఈ పెళ్లికి తాప్సీ స్నేహితురాళ్లు పావేల్ గులాటి, కనికా థిల్లాన్‌తో పాటు దర్శకనిర్మాత అనురాగ్ కశ్యప్ కూడా హాజరైనట్లు తెలిసింది. కనికా థిల్లాన్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొన్ని ఫొటోలను షేర్ చేసింది. వీటికి 'నా ఫ్రెండ్ పెళ్లిలో..' అనే క్యాప్షన్‌ను జోడించింది. దాంతో ఆమె తాప్సీ పెళ్లికే హాజరైందంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే అధికారిక ప్రకటన రావాల్సిందేనని అభిమానులు అనుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం తన పెళ్లిపై వస్తున్న వార్తలను తాప్సీ ఖండించింది. తన వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడే హక్కు ఎవరికీ లేదని సున్నితంగా హెచ్చరించింది. ఒకవేళ పెళ్లాడితే ఆ విషయాన్ని గోప్యంగా ఉంచనని, తొలుత అభిమానులతోనే పంచుకుంటానని చెప్పింది. ఈ నేపథ్యంలో తాప్సీ సీక్రెట్ మ్యారేజ్ న్యూస్ వైరల్ కావడం ఆసక్తిని రేకెత్తిస్తున్నది.

ఆ విషయంలో స్ట్రగుల్ పడ్డాను

తెరపై కమల్‌హాసన్ పోషించని పాత్ర, పండించని ఉద్వేగం లేదంటే అతిశయోక్తికాదు. దాంతో ఆయనకు కొత్త పాత్రలు రాయడం దర్శకులకు సవాలుగా మారింది. అందుకే ఆచితూచి పాత్రలను ఎంచుకుంటూ ముందుకెళ్తున్నారు కమల్. ప్రస్తుతం ఆయన చేస్తున్న సినిమాల గురించి, అందులోని తన పాత్రల గురించీ ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్‌వ్యూలో ఆసక్తికరంగా మాట్లాడారు కమల్. 'ఏపాత్ర పడితే ఆ పాత్ర చేయలేం. నటించడానికి అవకాశం ఉన్న పాత్ర చేస్తే అదో ఆత్మసంతృప్తి. కొన్నేళ్లు ఈ విషయంలోనే స్ట్రగుల్ పడ్డాను. ప్రస్తుతం చేస్తున్న పాత్రలన్నీ గొప్పవే. 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' రెండు సినిమాల షూటింగ్‌లూ పూర్తయ్యాయి. కేరక్టరైజేషన్ పాతదే అయినా, సినిమాలో కొత్తదనం ఉంటుంది. 'ఇండియన్ 2' విడుదలయ్యాక, 'ఇండియన్ 3' పోస్ట్‌ప్రొడక్షన్ వర్క్‌లో పాల్గొంటా. ఇక మణిరత్నంతో చేస్తున్న 'థగ్‌లైఫ్' షూటింగ్ ఎన్నికల హడావిడి అయిపోయాక మొదలుపెడతాం. 'కల్కి 2989'లో నాది విలన్ పాత్ర. నన్నందులో కొత్తగా చూస్తారు. ఇందులోని నా భాగం షూటింగ్ పూర్తిచేశాను.' అంటూ చెప్పుకొచ్చారు కమల్‌హాసన్. వీటితోపాటు శ్రుతిహాసన్, దర్శకుడు లోకేశ్ కనకరాజ్ కలిసి నటించిన స్పెషల్ సాంగ్ 'ఇనిమేల్'కు కూడా కమల్ వర్క్ చేశారు. ఆ పాట రాసింది కమల్‌హాసనే. సోమవారం ఈ పాట విడుదలైంది.

మిడిల్‌క్లాస్ మధురం..

'కుటుంబాన్ని గొప్ప స్థాయిలో నిలబెట్టేందుకు కష్టపడే ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ స్టారే. ఈ కథ విని పదిహేను నిమిషాల్లో ఓకే చెప్పాను. ఇది మధ్యతరగతి కుటుంబాల కథ. మిడిల్‌క్లాస్ భావోద్వేగాలన్నీ విజయ్ పాత్రలో ఉంటాయి. ప్రతి మధ్యతరగతి వ్యక్తీ తనకుతాను ఐడెంటిఫై చేసుకునేలా ఇందులో విజయ్ పాత్ర ఉంటుంది. ఏప్రిల్ 5న వస్తున్నాం. తప్పకుండా మీ అందర్నీ మెప్పిస్తాం' అన్నారు దిల్‌రాజు. మధ్యతరగతి భావోద్వేగాలకు వినోదాన్ని మేళవిస్తూ దిల్‌రాజు, శిరీష్‌ల నిర్మాణంలో పరశురామ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. బ్లాక్‌బస్టర్ 'గీతగోవిందం' తర్వాత పరశురామ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ నటిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని 'మధురము కదా..' అంటూ సాగే గీతాన్ని హైదరాబాద్ మై హోమ్ జెవెల్ గేటెడ్ కమ్యూనిటీలో పలు కుటుంబాల సమక్షంలో ఓ వేడుకగా విడుదల చేశారు. శ్రీమణి రాసిన ఈ గీతాన్ని గోపీసుందర్ స్వరపరచగా, శ్రేయాఘోషల్ ఆలపించారు. ఇది కుటుంబం గురించి ఆలోచించే కుర్రాడి కథ అనీ, థియేటర్‌కి వచ్చి ఎంజాయ్ చేయండని దేవరకొండ విజయ్ చెప్పారు. మృణాల్‌ఠాకూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్.

మోత మోగడం ఖాయం

విభిన్నమైన కథలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న నటుడు విశ్వక్‌సేన్. ఆయన కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'గ్యాంగ్ ఆఫ్ గోదావరి'. ఇందులో విశ్వక్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. కృష్ణచైతన్య రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మాతలు. మే 17న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని 'మోత..' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. చంద్రబోస్ రాసిన ఈ గీతాన్ని యువన్‌శంకర్‌రాజా స్వరపరచగా, ఎం.ఎం.మానసి ఆలపించారు. హోలీ పర్వదినాన ఈ పాటను విడుదల చేస్తుండటం పట్ల చిత్ర యూనిట్ ఆనందం వెలిబుచ్చింది. అందాల తార అయేషాఖాన్, విశ్వక్‌సేన్ తెరను పంచుకున్న ఈ పాట సినిమాకు ప్రధాన ఆకర్షణ అని మేకర్స్ చెబుతున్నారు. నేహా శెట్టి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అంజలి కీలక పాత్ర పోషిస్తున్నది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సహనిర్మాతలు వెంకట్ ఉప్పుటూరి, గోపీచంద్ ఇన్నమూరి సహనిర్మాతలు. కెమెరా: అనిత్ మంధాడి, సమర్పణ: శ్రీకర్ స్టూడియోస్.

ముచ్చటగా మూడోసారి

అభిరుచి గల టాలీవుడ్ నిర్మాతల్లో శివలెంక కృష్ణప్రసాద్ ఒకరు. ఆయన నిర్మాణంలో ఇంద్రగంటి మోహన్‌కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా సోమవారం మొదలైంది. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇప్పటికే జెంటిల్‌మెన్, సమ్మోహనం సినిమాలు వచ్చిన సంగతి తెలిసిందే. ముచ్చటగా మూడోసారి వీరి కాంబినేషన్‌లో సినిమా రూపొందుతుండటం విశేషం. ప్రియదర్శి, రూప కొడువాయూర్ ఇందులో జంటగా నటిస్తున్నారు. సోమవారం సంస్థ కార్యాలయంలో పూజా కార్యక్రమాలతో ఈ సినిమా ప్రారంభమైంది. దేవునిపటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి శివలెంక కృష్ణప్రసాద్ సతీమణి అనిత క్లాప్ ఇవ్వగా, దర్శకుడు ఇంద్రగంటి మోహన్‌కృష్ణ సతీమణి ఉమామహేశ్వరి కెమెరా స్విచాన్ చేశారు. 'మా సంస్థకు ఆత్మీయుడు, నాకు అత్యంత సన్నిహితుడైన మోహనకృష్ణ ఇంద్రగంటితో మళ్లీ సినిమా చేస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ కథకు హీరో హీరోయన్లుగా ప్రియదర్శి, రూప సరిగ్గా సరిపోతారు. వినోదంతోపాటు భావోద్వేగాలతో కూడిన స్వీట్ ఎంటర్‌టైనర్ ఈ సినిమా. జంధ్యాలగారి సినిమాలు గుర్తు చేసేంత క్యూట్‌గా ఈ సినిమా ఉంటుంది.' అన్నారు నిర్మాత శివలెంక. వి.కె.నరేశ్, తనికెళ్ల భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవ హర్ష, శివన్నారాయణ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: పి.జి.విందా, సంగీతం: వివేక్‌సాగర్.

'కలియుగం పట్టణంలో' గుర్తింపునిస్తుంది

తమిళంలో మూడు చిత్రాల్లో హీరోగా నటించిన నరేన్ రామా 'కలియుగం పట్టణంలో' చిత్రం ద్వారా తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెడుతున్నాడు. విశ్వకార్తికేయ, ఆయూషి పటేల్ జంటగా నటించిన ఈ చిత్రానికి రమాకాంత్ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిత్రంలో కీలక పాత్రలో నటించిన నరేన్ రామా మాట్లాడుతూ 'గుమ్మడిగారు నాకు తాతయ్య వరుస అవుతారు. తెలుగు వాళ్లమే అయినా చెన్నైలో స్థిరపడ్డాం. ఈ సినిమాలో నా పాత్ర కథాగమనంలో చాలా కీలకంగా ఉంటుంది. ఇదొక థ్రిల్లర్ మూవీ. యాక్షన్, సెంటిమెంట్ అంశాలతో ఆకట్టుకుంటుంది. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని పట్టణాల్లో కాలేజీ టూర్స్‌కు వెళ్లాం. అంతటా అద్భుతమైన స్పందన లభించింది. తెలుగులో ఈ సినిమా నాకు శుభారంభాన్నిస్తుందనే నమ్మకం ఉంది. ప్రస్తుతం తెలుగులో 'డబ్ల్యుహెచ్ఓ' అనే చిత్రంలో నటిస్తున్నా. మరికొన్ని చిత్రాలు చర్చల దశలో ఉన్నాయి' అన్నారు.

సామాన్యురాలిగా బతకడం బెస్ట్

మనం ఏది ఇస్తే, అదే మనకు తిరిగి వస్తుందంటారు. అదే కర్మసిద్ధాంతం. శ్రద్ధాకపూర్ ఈ విషయాన్ని బాగా అవగతం చేసుకుంది. అందుకే అభిమానులకు కావల్సినంత ప్రేమను పంచుతుంది. వాళ్లు కూడా అంతే ప్రేమను తిరిగి తనకిస్తుంటారు. రీసెంట్‌గా తన పుట్టినరోజును కూడా అభిమానులతో కలిసి జరపుకుంది శ్రద్ధా. ఫ్యాన్స్‌తో తను ఇంటరాక్ట్ అయ్యే తీరు చూసే ఏమో.. ముంబయిలో జరిగిన ఓ అవార్డు వేడుకలో 'మోస్ట్ స్టైలిష్ ఫ్యాన్ ఫేవరెట్ సూపర్ స్టార్' బిరుదుతో శ్రద్ధను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'స్టార్‌డమ్ శాశ్వతంగా ఉండదు. అందుకే సామాన్యురాలిగా బతకడం బెస్ట్. ఇప్పటికీ నాకు కావాల్సింది నేనే స్వయంగా మార్కెట్‌కెళ్లి తెచ్చుకుంటాను. తినాలనిపిస్తే, రోడ్డు పక్కన అందరితో నిలబడి పావ్‌బాజీ తింటాను. అందులోనే నాకు ఆనందం ఉంది. రేపు ఈ స్టార్‌డమ్ లేనిరోజు ఒకటి వస్తుంది. అప్పుడు నా తోటి స్టార్లందరి కంటే నేను హ్యాపీగా ఉంటాను.' అంటూ చెప్పుకొచ్చింది శ్రద్ధా కపూర్.